


*ఎంతెంతదూరం*

**తెలుగులో హాస్య** పత్రికలు 1960లలో జోకర్ అనే మాసపత్రిక వచ్చేది. తర్వాత శంకు క్రోక్విల్ తరఫున హాస్యప్రియని తెచ్చారు. అదీ ఇప్పుడు రావడంలేదు. విజయవాడ నించి (ఇప్పుడది మంగళగిరికి మారింది) హాస్యానందం అనే మాసపత్రిక కొంతకాలంగా వస్తోంది. దాని యజమాని, సంపాదకుడు శ్రీ రాము. అతను నన్ను కలిసి సీరియల్ అడిగారు కానీ నేను కోరిన పారితోషికం చెల్లించలేనని అతను చెప్పడంతో ఒక పేజీ హాస్య కథలని కామిక్ మేజిక్ శీర్షిక కింద చాలా కాలం రాసాను. తర్వాత అతను ఇవ్వగలిగే పారితోషికం మాత్రమే తీసుకుని ఎంతెంత దూరం? అనే కామెడీ సీరియల్‌ని 2006 – 07లో రాసాను. నెలనెలా రాము విజయవాడ నించి హైద్రాబాద్ వచ్చేవారు. నన్ను కలిసి పత్రిక, పారితోషికం ఇచ్చి తర్వాతి నెల స్క్రిప్ట్ తీసుకెళ్ళేవారు.




నేను అనేక క్రైమ్ కథలని చదివాను. దాదాపు డజను కథల్లో ఒకటే సంఘటన. భార్యని చంపి పాతడం. అమెరికన్ క్రైమ్ కథా రచయితల ఈ అబ్సెషన్ నించి నాకీ నవలకి స్ఫూర్తి లభించింది. దీనికి బ్లాక్ మెయిల్ జోడిస్తే అనే ఆలోచనతో ఈ థీమ్‌ని అల్లుకున్నాను. ఇది సీరియస్ సబ్జెక్టే ఐనా పాత్రలని కామెడీ చేస్తే క్రైమ్ కామెడీగా మారింది. స్థూలంగా కథ.

అశ్విన్ పెళ్ళిళ్ళ కేటరర్ వృత్తిలో ఉంటూ పెద్ద ఇల్లు కొనాలనే కల కంటున్నాడు. సూపర్‌బజార్లో పరిచయమైన 'చారు'లతతో ప్రేమలో పడి పెళ్ళి చేసుకుంటాడు. తల్లితండ్రులని తను ప్రేమించిన అమ్మాయిని చేసుకోడానికి వప్పించడం నించి అశ్విన్, చారులతల హనీమూన్ వరకు అన్నీ నవ్వు పుట్టించే అగచాట్లే. అతను కొన్న ఇంట్లో ఓ రోజు వర్షంలో ఎన్నడో పాతిన ఓ శవం చెయ్యి బయటికి వస్తుంది. అది కుంచితపాదం భార్యదని తెలిగ్గా గ్రహిస్తాడు. భార్యని చంపి, ఖాళీగా ఉన్న పక్కింట్లో పాతిపెట్టిన పరమపిసినారైన కుంచితపాదం అప్పటికే ఆమె లేచిపోయిందనే వదంతిని పుట్టించాడు. అశ్విన్ అతన్ని స్వలాభానికి కాకుండా సమాజ శ్రేయస్సుకి బ్లాక్‌మెయిల్ చేస్తాడు. అనాధ శరణాలయానికో, రెడ్‌క్రాస్‌కో డబ్బుని డొనేట్ చేయిస్తాడు. చారులత అమెరికాకి వెళ్ళే ప్రయత్నంలో ఉంటుంది.

ఓ రోజు కుంచితపాదానికి తన పక్కింటి అశ్విన్ బ్లాక్‌మెయిలర్ అని తెలుస్తుంది. దాంతో అతన్ని చంపడానికి క్రైమాష్ అనే కిరాయి హంతకుడ్ని నియమిస్తాడు. కానీ క్రైమాష్ అప్పటికే సాయిబాబా భక్తిలో పడి ఆ వృత్తి మానేసాడు. చంపించడానికి తనని కలిసేవారి బాధితులకి మేలు చేస్తూంటాడు. వివరాలన్నీ తెలుసుకుని, అతను చస్తే పోలీసులకి పట్టిస్తానని, తనని నియమించేవారిని బెదిరించి హత్యల నించి ప్రజల్ని కాపాడటమే అతని కొత్త ప్రవృత్తిగా మారింది. అతని సహాయంతో అశ్విన్ కుంచితపాదంతో ఇళ్ళు మార్చుకుందామని ప్రతిపాదించి అతని పెద్ద ఇంటిని అనాథాశ్రమంగా మార్చి, తన చిన్న ఇంటిని కుంచితపాదంకి ఇచ్చేస్తాడు.

అశ్విన్‌కి పోర్ట్‌లాండ్‌లోని మారియట్ హోటల్లో షెఫ్ ఉద్యోగం రావడంతో కుంచితపాదాన్ని క్షమించి అమెరికాకి వలస వెళ్ళిపోవడంతో కథ ముగుస్తుంది.

2007లో నేను గాఢమైన ఆధ్యాత్మిక జీవనం సాగిస్తుండటంతో కిరాయి హంతకుడ్ని మంచివాడిగా చేసాను. నాకు అప్పట్లో ఓ కేటరర్‌తో పరిచయం ఏర్పడబట్టి హీరోని కేటరర్‌గా చేసాను. తిప్పయ్య, కూర్మంలాంటి చిత్రమైన పేర్లుకూడా చాలా పాత్రలకి పెట్టాను. నా చాలా కామెడీ నవలల్లోలాగా ఇందులో కూడా కథ తక్కువ. కథనం ఎక్కువ. నేను, అల్లురామలింగయ్యగారు ఓసారి హైదరాబాద్‌నించి మద్రాస్‌కి పక్కపక్క సీట్లలో కూర్చుని ప్రయాణం చేస్తున్నాం. అప్పట్లో ఇండియన్ ఎయిర్‌లైన్స్ ఉండేది. ఎయిర్ హోస్టెస్‌లు విమానం బయలుదేరబోయే ముందు చాక్లెట్లు ఇచ్చేవాళ్ళు. నేను రెండు తీసుకున్నాను కానీ ఆయన రెండు చేతులతో చారెడు చాక్లెట్లు తీసుకున్నారు. తర్వాత ఎయిర్ హోస్టెస్ వినేలా నాతో చెప్పారు. "ఇంటికెళ్ళగానే నా మనవలు, మనవరాళ్ళు తాతయ్యా చాక్లెట్లు అని అడుగుతారు. వాళ్ళకి తెలుసు విమానంలో చాక్లెట్లు ఇస్తారని" అన్నారు. అది ఈ నవల్లో ఓ చోట వాడాను. కానీ పాతికేళ్ళ హీరో ఆ మాట చెప్పి చాక్లెట్లు తీసుకుంటాడు.

జులై 2008లో దీన్ని సాహితీ ప్రచురణలు ప్రచురించారు. వెల రూ.60 / - మలి ముద్రణలు కూడా వేసారు.

192 పేజీల ఎంతెంత దూరం? నవల మొదటి పేజీలో మీకే అంకితం కనిపించి, అది ఎలాంటి నవలో క్లూ ఇస్తుంది.

*ఓ విదేశం నించి నా అభిమాన పాఠకురాలు శ్రీమతి త్రిపురనేని మధుమణి నాకు ఫోన్ చేసి నా కొత్త సీరియల్ని చదివానని చెప్పింది.*

*"ఏది?" అడిగాను.*

*ఆమె తన భర్తని గట్టిగా అడిగిన మాటలు నాకు వినపడ్డాయి.*

*"ఏమండీ. హాస్యానందంలో వచ్చిన మల్లాది వెంకట కృష్ణమూర్తి సీరియల్ పేరేమిటండీ?"*

*"ఏదీ? చెత్త సీరియల్ అన్నావు నువ్వు? అదేనా?"*

*"అవునండీ. అదే."*

*అందుకని శ్రీమతి త్రిపురనేని మధుమణికి బదులు దీన్ని అసలు నాకు ఫోన్ చేయని, నా కొ(చె)త్త సీరియల్‌ని అసలు చదవని అభిమాన పాఠకులు అందరికీ దీన్ని అంకితం ఇస్తున్నాను - మల్లాది వెంకట కృష్ణమూర్తి*

*పి.ఎస్: ఇది కామెడీ నవలని ఈ అంకితాన్ని బట్టి కనిపెట్టారా?*

*తాజా కలం: ఈ కథ కాని, బ్లాక్ మెయిల్‌ద్వారా సమాజోద్ధరణ కాని, పద్మజ మల్లాదిగారికి ఎంత మాత్రం నచ్చలేదు. తనకి నేను రాసిన నవలల్లో ఎంత మాత్రం నచ్చని నవల ఇదేట!*

## తాడంకి ది థర్డ్

సాక్షి ఆదివారం అనుబంధం ఫన్ డేకి ఓ సీరియల్ కావాలని 2008 అక్టోబర్లో అక్కడ పనిచేసే శ్రీ బాలగారు నాకు ఫోన్ చేసారు. ఆమె వార్తలో పనిచేస్తూండగా నాకు పరిచయం.

ముందు అనుకున్న టైంకి దాని ఎడిటర్ - ఇన్ - ఛార్జ్ ప్రియదర్శిని రామ్ గారిని కలిసాను. తను జర్నలిజానికి చెందని వ్యక్తినని, తన కెరీర్ అడ్వర్టైజ్మెంట్‌కి సంబంధించిందని రామ్ చెప్పారు. సాక్షిలో ఆయన రాసే 'హేవ్ ఫన్' అనే కాలంని ఇష్టంగా చదివేవాడిని.




"ఎలాంటి సీరియల్ నా నించి ఎదురు చూస్తున్నారు?" అడిగాను.

"మాకు మీరు ఏం సీరియల్ రాసినా సంతోషమే."

నేను మూడు రకాల థీమ్స్ చెప్పాను. ఒకటి ఆధ్యాత్మికం. అది నా మొదటి ప్రెఫరెన్స్ అని, రెండోది కామెడీ, మూడోది సామాజికం అని ఆ కథల్ని క్లుప్తంగా చెప్పాను.

"ఆ మూడూ నాకు నచ్చాయి. మీ గురించి ఎంక్వయిరీ చేసాను. ఏజెంట్లు కూడా మీ రచనలు వేయడం మంచిదని సూచించారు. రచయితగా మీరు మాకు కావాలి. కాబట్టి వరసగా ఒకదాని తర్వాత ఒకటి మీరు ఆ మూడూ మాకే రాయండి. ఏది ముందు రాస్తారో ఛాయిస్ మీది."

శ్రీబాల సీరియల్‌ని కో ఆర్డినేట్ చేస్తారని ఆమెని పిలిచి సీరియల్ గురించి చెప్పారు. నన్ను సాక్షి ఆఫీస్‌లోని చాలామంది జర్నలిస్ట్‌లకి పరిచయం చేసి, 'మనకి రాస్తున్నారు' అని చెప్పారు. తర్వాత తెలిసింది రామ్ సినిమాల్లో నటించారని, సినిమా ఇండస్ట్రీతో సంబంధ బాంధవ్యాలు ఉన్నాయని. ఆ విషయాలు మా పరిచయంలో రామ్ చెప్పనే లేదు. 2015లో వచ్చిన జ్యోతిలక్ష్మిలో కూడా ఆయన ఓ పాత్రలో నటించారు.

సస్పెన్స్, కామెడీ గల 'తాడంకి ది థర్డ్' అనే నవలని సీరియల్‌గా రాసాను. కానీ కొన్నివారాలకి శ్రీ రాజిరెడ్డి అనే అతను ఫోన్ చేసి శ్రీబాల తప్పుకున్నారని, తను ఫన్‌డే ఇన్‌ఛార్జ్‌గా వచ్చానని చెప్పారు. ఆశ్చర్యంగా ఫన్‌డేలో ఆ సీరియల్ వస్తున్నంత కాలం ఒక్కటంటే ఒక్క ఉత్తరాన్ని కూడా బావుందని కానీ, బాగోలేదని కానీ వేయలేదు. అంతదాకా నేను రాసిన ఎనభైకి పైగా సీరియల్స్‌లో దేనికీ ఇలా జరగలేదు. కారణం తెలిసినా దాన్ని కన్‌ఫం చేసుకోడానికి ఈ రోజుకీ నేను రాజిరెడ్డిని ఆ విషయం అడగలేదు. సరైన యజమాని లేకపోతే కొందరు సంపాదకులు కొన్ని ఇజాలకి కట్టుబడి వాటితో పత్రికలని నడపడం నేడు ఆచారంగా మారింది.

సాక్షి ఆఫీస్‌లో పని చేసే మల్లేష్ అనే లే అవుట్ ఆర్టిస్ట్ తన ఇంటి దారిలో ఉన్న మా ఇంటికి వచ్చి వారంవారం సీరియల్ రాతప్రతిని తీసుకునే ఏర్పాటు చేసారు. అతన్ని ఇబ్బంది పెట్టడం ఎందుకని నేను కొరియర్‌లో పంపుతానన్నా అందుకు ఇద్దరూ అంగీకరించలేదు. 'తాడంకి ది థర్డ్' సీరియల్ అయిపోయాక ఎందుకనో ఆ తర్వాత మిగిలిన రెండు సీరియల్స్‌ని రాయమని రామ్ అడగలేదు. సీరియల్స్ వరకు ఎవరైనా అడిగితే కానీ ఇంతదాకా నేను నా అంతట నేనుగా రాయలేదు.

ఈ సీరియల్లోని పాత్రల పేర్లన్నీ పుణ్యక్షేత్రాలవి. కారణం మళ్ళీ నా ఆధ్యాత్మిక జీవితమే. అవన్నీ కామెడి పేర్లుగా పాఠకులు గుర్తించారు. ఇందులో చాలా పాత్రలు ఉన్నాయి. గంగాజలం, ప్రాణలింగం, శ్రీ ముఖం, అభయకేశ్వరంలాంటివి. స్థూలంగా కథ తాడంకి (ఇంటిపేరు) గోకర్ణం భార్య జ్ఞానేశ్వరి కథా కాలానికి దాదాపు ఏడేళ్ళ క్రితం గోకర్ణంతో కేదార్‌నాథ్ వెళ్ళింది. అక్కడ దారిలో ఆమె ఎక్కిన గుర్రం బెదిరి లోయలో పడిపోయింది. ఆవిడ మృతదేహం కూడా దొరకలేదు. 60 ఏళ్ళ గోకర్ణం తన కన్నా నలభై ఏళ్ళు చిన్నదైన, తన కూతురు ఉత్కళకి సంగీతం నేర్పే బృందావనితో ప్రేమలోపడి ఆమెని పెళ్ళి చేసుకోవాలని తాంబూలాలు కూడా పుచ్చుకున్నాడు.

గోకర్ణంకి ఉన్న పెద్ద స్థలాన్ని ఘటికాచలం ఫైవ్ స్టార్ హోటల్ కట్టడానికి కొన్నాడు. ఆ స్థలం గోకర్ణం తండ్రిది. ఆయన రాసిన వీలునామా గురించి, గోకర్ణానికి పిల్లలు పుడితే ఆ స్థలంలో తన మనవడికి భాగం వస్తుందని గోకర్ణం తండ్రి రాసాడని తర్వాత తెలిసింది. గోకర్ణంకి బృందావనితో పెళ్ళి జరగబోతోందని తెలిసి ఘటికాచలం ఆమెని కిడ్నాప్ చేయించాడు. కానీ ఆమెని చంపేలోగా తప్పించుకుంది.

జ్ఞానేశ్వరి ఇంతకాలం గతం మరిచిపోవడంతో రాలేదు. కోర్టులో తమ పెళ్ళి రద్దు చేయడానికి చేసిన ప్రయత్నంలో భాగంగా తన ఫోటోని పేపర్లో చూసిన జ్ఞానేశ్వరికి గతం గుర్తొచ్చి తిరిగి గోకర్ణం దగ్గరికి వచ్చింది. ఐతే ఏడు సంవత్సరాల తర్వాత ఒక్కరోజు ఆలస్యంగా రావడంతో సాంకేతికంగా వారి పెళ్ళి రద్దయింది. తన భార్యంటే గోకర్ణానికి ప్రేమే.

చివరికి బృందావని గర్భవతని తెలియడంతో, కేవలం డబ్బు కోసమే తనతో ప్రేమ నటించిందని తెలుసుకున్న గోకర్ణం ఇక ఆమెకి ఉద్వాసన చెప్పేసి, జ్ఞానేశ్వరిని స్వీకరించడంతో కథ ఆనందంగా ముగుస్తుంది. దీంట్లో కూడా కథతోపాటు కథనం ద్వారా కామెడీని సృష్టించాను. పూర్వం కొన్ని నాన్‌వెజ్ హోటల్స్ పేర్ల ప్రక్కన బ్రాకెట్లో మిలటరీ హోటల్ అని రాసేవారు. ఈ నవల్లోని అలాంటి మిలటరీ హోటల్లోని వెయిటర్లు మిలటరీ నించి రిటైరైన సిపాయిలు యూనిఫారాల్లో తుపాకులు పట్టుకుని మిలటరీ జీప్‌లలో కూర్చున్న వారి ఆర్డర్స్ తీసుకుని సర్వ్ చేస్తారని రాసాను. వెయిటర్స్ లెఫ్ట్ రైట్ చేసుకుంటూ కస్టమర్ల దగ్గరికి రావడం, అబౌట్ టర్న్ చేసి వెనక్కి వెళ్ళడం, యుద్ధరంగంలోలలా అకస్మాత్తుగా పొగ ఆవరించి మాయమవడం, టేంకులు, తుపాకులు పేలే శబ్దాలు, మిలటరీ బేండ్ మిలటరీ సంగీతాన్ని వాయించడంలాంటివి ఆసక్తిగా ఉంటాయి.

దీనికి సరైన పేరు కోసం చాలా వారాలు తపించాను. చివరికి ఓ రోజు నేను చదివే ఓ పుస్తకంలో ఎడ్వర్డ్ ది థర్డ్ పేరు కనపడింది. ఎడ్వర్డ్ మనవడు ఎడ్వర్డ్ ది థర్డ్. దాంతో పుట్టబోయే బిడ్డ గోకర్ణం తండ్రికి ది థర్డ్ అవుతాడు. రైమింగ్ కోసం 'త'తో మొదలయ్యే పేరు గురించి ఆలోచిస్తూంటే విజయవాడలో, గాంధీనగర్‌లోని 'తాడంకి వారి వీధి' పేరు గుర్తొచ్చింది. దాంతో దీనికి 'తాడంకి ది థర్డ్' అనే పేరు పెట్టాను.

240 పేజీల ఈ నవలని సాహితీ సంస్థ ఫిబ్రవరి 2009లో ప్రచురించింది. వెల రూ. 80/- మలి ముద్రణలు కూడా వచ్చాయి.

www.anandbooks.com

www.telugubooks.in ***ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి***

Post your comments